

హైదరాబాద్ టైమ్స్

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 273 శనివారం 7 నవంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

అమెరికాకు అణు ప్రతిపాదనను పంపిన ఇరాన్

చర్చలకు ముందు ఏడు షరతులను పూర్తి చేయాలని స్పష్టీకరణ

ఖతార్ ద్వారా ఈ ప్రతిపాదనను పంపినట్లు 'రాయిటర్స్' వెల్లడి

ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం తర్వాత దౌత్య ప్రయత్నాలు


2

మధ్యంతర ఎన్నికల ఓటమి తర్వాత ట్రంప్ యంత్రాంగంలో తొలి రాజీనామా

అమెరికా పౌర హక్కుల విభాగం చీఫ్ పదవికి హర్మీత్ కౌర్ ధిల్లాన్ రాజీనామా

ఎన్నికలకు ముందే రాజీనామా చేసినా ఆగాలని సూచించిన ట్రంప్ కార్యాలయం

వివాదాస్పద నిర్ణయాలతో వార్తల్లో నిలిచిన భారత సంతతి అధికారిణి


2

తెలంగాణ కాంగ్రెస్ పంచాయతీల పై ఏఐసీసీకి టీపీసీసీ చీఫ్ నివేదిక



తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పంచాయతీల పై ఏఐసీసీకి రిపోర్ట్ చేరింది. అన్ని పంచాయతీలపై ముందస్తు సమాచారంతో అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రిపోర్ట్ పంపించారు. మంత్రి దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావులకు మధ్య జరిగిన వివాదంపై నివేదిక పంపారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా రిపోర్ట్ పంపించారు. - మిగతా2లో

సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు

సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల పై ప్రత్యేక దృష్టి

వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు

పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు 2లో



కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు

దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ

కల్వకుర్తి మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శ

పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్ పై ధ్వజం


2



బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టు పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు. - మిగతా2లో

దీపావళి కానుకల సంస్కృతి పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీపావళి సందర్భంగా కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కూడా వాహన కాలుష్యానికి కారణమవు తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఏటా కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీలో పరిస్థితులు మారాలంటే ప్రజల ఆలోచనా విధానం, జీవనశైలిలో మార్పు రావాలని సూచించారు. - మిగతా2లో

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ఎస్టీ కమిషన్ ప్రాధాన్యం ఇవ్వాలి



తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తమ పార్టీ డిమాండ్‌కు తలొగ్గే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. - మిగతా2లో

సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు

నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7,8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు. నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు. కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు. రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు

రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకు పోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ఎస్టీ కమిషన్ ప్రాధాన్యం ఇవ్వాలి

తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తమ పార్టీ డిమాండ్‌కు తలొగ్గే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. టీఆర్ఎస్ కారణంగానే ఆదివాసీలు, గిరిజనుల ఆకాంక్షలను గౌరవిస్తూ తెలంగాణ కేబినెట్ ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఏర్పాటు చేయడంతో ఆ కమిషన్ అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోయిందని కవిత అభిప్రాయపడ్డారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు వేర్వేరుగా ఉన్నాయన్నారు. ఇప్పటికీ ఎస్సీలు పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవుల నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. జల్-జంగల్-జమీన్‌పై గిరిజనులు హక్కులు కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని కవిత పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని, వారి ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని కవిత సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం..

కాగా, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలు, హక్కులను కాపాడేందుకు వారికి వేర్వేరు కమిషన్లు అవసరమని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఈ మేరకు నవంబర్ 5న జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 'తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టం-2003'ను రద్దు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దాని స్థానంలో 'తెలంగాణ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చట్టం-2026', 'తెలంగాణ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చట్టం-2026'లను తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్సుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జాతీయ స్థాయిలో ఆర్టికల్ 338, 338ఏ కింద జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోనూ ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

దీపావళి కానుకల సంస్కృతి పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీపావళి సందర్భంగా కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కూడా వాహన కాలుష్యానికి కారణమవుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఏటా కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీలో పరిస్థితులు మారాలంటే ప్రజల ఆలోచనా విధానం, జీవనశైలిలో మార్పు రావాలని సూచించారు. ముఖ్యంగా సంపన్నులు దీపావళి కానుకల సంప్రదాయాన్ని సామాజిక హోదా, ప్రతిష్ఠకు చిహ్నంగా మార్చేశారని వ్యాఖ్యానించారు. ఢిల్లీ కాలుష్యంపై శుక్రవారం విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి వల్ల వాహనాల రాకపోకలు పెరిగి కాలుష్యం ఎక్కువవుతోందని పేర్కొన్నారు. మన అసలైన సంప్రదాయం ఏమిటో, ఏ పద్ధతులు పాటించాలో ప్రజలు గుర్తించాలని అన్నారు. దీపావళి కానుకల పంపిణీని తగ్గించడం కూడా కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంస్కృతిక మార్పుల్లో భాగమని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఢిల్లీలో గాలి నాణ్యత మరింత దిగజారింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం శుక్రవారం నగర సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 389గా నమోదైంది. పలు ప్రాంతాల్లో ఇది 400 దాటింది. దీంతో గాలి నాణ్యత తీవ్ర కేటగిరీకి చేరువైంది. దీపావళి నవంబర్ 8న జరగనున్న నేపథ్యంలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగ కానుకల కొనుగోళ్లు, పంపిణీతో వాహనాల రద్దీ పెరుగుతోందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలోకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు వస్తుండటంతో వాటి కాలుష్య ఉద్గారాలను పర్యవేక్షించడం కష్టమవుతోందని సీజేఐ పేర్కొన్నారు. ఒక వాహనం కేవలం రెండు గంటల పాటు నగరంలో తిరిగినా కాలుష్యానికి కారణమవుతుందని అన్నారు. వాహనాల సంఖ్య మాత్రమే కాకుండా అవి రోడ్లపై ఎంతసేపు తిరుగుతున్నాయన్నది కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు తెలిపారు. ఇప్పటికే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) రెండో దశ అమల్లో ఉందని, రోడ్లపై నీళ్లు చల్లడం, సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాల (పీయూసీ) పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారో గుర్తించేలా జియోట్యాగింగ్ చేస్తున్నామని చెప్పారు.

బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టు పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్ రావుల పై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయన పై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు" అని కేటీఆర్ పేర్కొన్నారు. బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

తెలంగాణ కాంగ్రెస్ పంచాయతీల పై ఏఐసీసీకి టీపీసీసీ చీఫ్ నివేదిక

కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ అంశాన్ని హైకమాండ్‌కు చేరవేశారు. అంతే కాకుండా పెద్దపల్లిలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ రిపోర్ట్ పంపారు. త్వరలోనే అన్ని పంచాయతీలపై ఇరువర్గాలతో మాట్లాడి పూర్తి నివేదికను పీసీసీ చీఫ్ తయారు చేయనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఇబ్బందులన్నింటినీ పరిష్కరించే యోచనలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఉన్నట్లు తెలుస్తోంది. దాంట్లో భాగంగా పార్టీలో ఎక్కడెక్కడ గొడవలు, ఇబ్బందులు ఉన్నాయి.. అలాగే ఆధిపత్య పోరు ఎక్కడ ఉందనే దానిపై లిస్ట్ అవుట్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదాన్ని సర్దుమణిగించేందుకు ప్రయత్నం చేశారు. అయితే నిన్న కేబినెట్ సమావేశం ఉండటంతో మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీభవన్‌కు రాలేదు. అలాగే.. పెద్దపల్లి కాంగ్రెస్ పంచాయతీ గాంధీ భవన్‌కు చేరింది. ఎంపీ వంశీ కృష్ణ, మంత్రి శ్రీధర్ బాబు మధ్య చాలా రోజులుగా కోల్డ్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గాంధీభవన్‌కు రావాల్సిందిగా మంత్రి, ఎంపీని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. వంశీ వర్గం నేతల సస్పెన్షన్, మంత్రి శ్రీధర్ బాబుకు ఎంపీ రాసిన లేఖ.. ఇద్దరి మధ్య తీవ్ర విభేదాలకు కారణంగా మారిందని చర్చ జరుగుతోంది. దీంతో ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పీసీసీ చీఫ్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నిధుల విడుదలలో జాప్యం విషయంలో కాంగ్రెస్ సర్కార్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ సీరియస్‌గా తీసుకుంది. గాంధీభవన్‌కు రావాల్సిందిగా ఎమ్మెల్యేకు ఫోన్ వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్యే లండన్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత గాంధీ భవన్ వచ్చి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆదేశించింది. వీటితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంతో పాటు మిగిలిన చోట్ల జరుగుతున్న వ్యవహారాలపై మహేశ్ కుమార్ గౌడ్ దృష్టిసారించారు.

అమెరికాకు అణు ప్రతిపాదనను పంపిన ఇరాన్

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, ఇరాన్ దౌత్యపరంగా ఒక కీలక ముందడుగు వేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాకు ఒక అణు ప్రతిపాదనను పంపింది. అయితే, చర్చలు ప్రారంభించాలంటే ముందుగా తమ ఏడు షరతులను వాషింగ్టన్ నెరవేర్చాలని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌ను 'నాశనం చేస్తామని' అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. 'రాయిటర్స్' వార్తా సంస్థ కథనం ప్రకారం.. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక సీనియర్ ఇరాన్ అధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇరాన్ పంపిన ప్రతిపాదనను అమెరికా పరిశీలిస్తోందని, అయితే ప్రతిపాదనలోని వివరాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. అంతకుముందు ఇరాన్ భద్రతా అధికారి మొహసెన్ రెజాయీ మాట్లాడుతూ. "మేం అమెరికా ముందు ఏడు షరతులు ఉంచాం. అవి నెరవేర్చే వరకు హర్ముజ్ జలసంధిని తెరవబోం, చర్చలు కూడా జరపం" అని స్పష్టం చేశారు.

ఇరాన్ ఏడు షరతులు ఇవేనా?

ఇరాన్ అధికారికంగా తమ షరతుల జాబితాను ప్రకటించనప్పటికీ, మీడియా కథనాల ప్రకారం ఈ డిమాండ్లలో పలు కీలక అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లెబనాన్ సహా తమపై అన్ని రకాల శత్రుత్వాలను అమెరికా నిలిపివేయడం, ఇరాన్ ఓడరేవులపై విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, అన్ని ఆర్థిక ఆంక్షలను తొలగించడం, స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయడం, పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా సైనిక ఉనికిని తగ్గించడం, యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడం, తమ భూభాగంపై దాడులను ఆపడం వంటివి ఈ షరతులలో ఉన్నట్లు సమాచారం. అయితే, ఎలాంటి చర్చలు మొదలైనా అందులో అణు అంశాలే ప్రధానంగా ఉండాలని వాషింగ్టన్ పట్టుబడుతోంది.

మధ్యంతర ఎన్నికల ఓటమి తర్వాత ట్రంప్ యంత్రాంగంలో తొలి రాజీనామా

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వంలోని పౌర హక్కుల విభాగం చీఫ్‌గా పనిచేస్తున్న భారత సంతతి అధికారిణి, ట్రంప్ గట్టి మద్దతుదారైన హర్మీత్ కౌర్ ధిల్లాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్ యంత్రాంగం నుంచి వైదొలగిన తొలి సీనియర్ అధికారి ఈమే కావడం గమనార్హం. హర్మీత్ ధిల్లాన్ రాజీనామా విషయాన్ని అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచె గురువారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. "ఆమె ప్రతీ అమెరికన్ పౌర స్వేచ్ఛను కాపాడారు. ఎలాంటి భయం లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేశారు. ఆమె సేవలకు డిపార్ట్‌మెంట్ తరఫున కృతజ్ఞతలు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం" అని బ్లాంచె పేర్కొన్నారు. అయితే, తాను మధ్యంతర ఎన్నికలకు నెల రోజుల ముందే రాజీనామా సమర్పించానని, కానీ ఎన్నికలు ముగిసే వరకు పదవిలో కొనసాగాలని ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్ కోరారని హర్మీత్ ధిల్లాన్ ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. సాధారణంగా అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత అధ్యక్షుడు తన యంత్రాంగాన్ని పునర్ వ్యవస్థీకరించుకునేందుకు వీలుగా సీనియర్ అధికారులు వైదొలగడం ఆనవాయితీ. ట్రంప్‌కు గట్టి మద్దతుదారు అయినప్పటికీ, కొన్ని విషయాల్లో హర్మీత్ భిన్నంగా వ్యవహరించారు. ముఖ్యంగా, వలసదారుల విషయంలో సిక్కు ట్రక్కు డ్రైవర్లను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగస్టులో ఒక సిక్కు డ్రైవర్ ప్రమాదానికి కారణమైనప్పుడు, "కొందరు ఈ విషాదాలను అదనుగా తీసుకుని చట్టాన్ని గౌరవించే సిక్కు, భారత సంతతి డ్రైవర్లపై వారి మూలాల కారణంగా దాడి చేస్తున్నారు. ఇక్కడే పుట్టిన లేదా చట్టబద్ధంగా వలస వచ్చిన ఈ డ్రైవర్లు చాలా దేశభక్తి కలిగిన వారు, కష్టపడి పనిచేసేవారు" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

సంపాదకీయం

కేంద్రం కలిసొస్తేనే తుఫాన్లకు ఎదురీదేది!



వచ్చేది ఎంత పెద్ద తుఫానైనా పర్యవేక్షించేది చంద్రబాబు నాయుడైతే దాన్ని అదుపు చేయటం సాధ్యమే అనిపిస్తుంది! నష్టాన్ని హద్దుమీరనివ్వని ముఖ్యమంత్రి కాబట్టి తుఫాన్లు తోక ముడిచి తీరం దాటుతాయి! ఒకదానివెనుక ఒకటిగా 'అర్నబ్', 'మురసు' సైక్లోన్లు వచ్చినప్పటికీ, అవి దూరాన పొడ చూపినప్పుడే సంసిద్ధంగా ఉండటం వల్ల, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవటం వల్ల-- ఆ రెండు తుఫాన్ల వల్ల ప్రాణనష్టం తక్కువే జరిగిందిమొదట అక్టోబర్ 28న వచ్చిన 'అర్నబ్' రూ.4,526 కోట్ల నష్టం చేసిందని అంచనా. ఈ తుఫాను వల్ల ఒరిస్సా దక్షిణ ప్రాంతాల్లో 90,000 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని లెక్కలు చెప్తున్నాయి. తర్వాత నవంబర్ 3న వచ్చిన 'మురసు' తుఫాను వల్ల 52,500 హెక్టార్లలో కాపుకొచ్చిన పంట నష్టమైంది. ఈ రెండు తుఫాన్ల వల్ల పోయిన ప్రాణాలు ఏడు మాత్రమేనని ప్రాథమిక అంచనాలో తేలింది. రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్.టి.జి.యస్)తో పాటు సాంకేతిక నిపుణుల సహాయం వల్ల ప్రాణనష్టం, సంపద నష్టం తక్కువయ్యాయి. ఎప్పటి మాదిరే కేంద్ర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపిన తర్వాత, నష్టం ప్రాథమిక అంచనాలను లెక్కలోకి తీసుకొని, ధన సాయం, ఇతర సహకారాలు వస్తు రూపేణా అందజేసే అవకాశం ఉంది. అక్టోబర్ 2014లో 'హుద్ హుద్' తుఫాను సంభవించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత చొరవతో అధికారుల కంటే ముందుండి మార్గదర్శకత్వం వహించి తుఫానుతో పోరాడారు. నాయకుడిగా ధన, మాన, ప్రాణాల రక్షణకు బలమైన కారణమయ్యారు. ప్రభుత్వాలన్నీ ఆపద సమయాల్లో ఎంతోకొంత ఆదుకొనే ప్రయత్నం చేస్తాయి. కానీ ప్రభుత్వాన్ని మొత్తం క్షేత్రస్థాయికి హుటాహుటిన తరలించి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తే ముందుండి సహాయక చర్యలు చేపట్టడం చాలా అరుదు. అధికారం ఉన్నది అనుభవించటానికే అనుకొనే రాజకీయ నాయకుల మధ్య, ఆపదల్లో ప్రజలను ఆదుకోవటమే తన బాధ్యతగా, లక్ష్యంగా భావించే చంద్రబాబు వ్యవహార శైలి కారణంగానే సామాన్యుడి నుంచి అమిత ఆదరణ, మెప్పు లభిస్తాయి.తుఫాను సమయంలో సముద్ర తీరాల్లో ఉండే మత్స్యకారుల జీవితం దినమొక గండంగా మారుతున్నది. ధైర్యం చేసి వేట కోసం సముద్రంలోకి వెళ్లేవారు క్షేమంగా తిరిగివచ్చేంత వరకు కళ్లలో ఒత్తులు వేసుకొని చూడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, ఇలాంటి ఆపదలను ముందుగానే పసిగట్టే నిపుణుల అవసరమూ ఉంది. ముందుగానే వ్యూహాత్మక చర్యలు చేపట్టగలిగే నేర్పున్నవారు కావాలి. అలాగే రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వంలోని అధికారులకు మధ్య సాధ్యమైనంత సహకారం ముఖ్యం. రాష్ట్రాల అధికారులతో పాటు కేంద్రంలో పనిచేసే ఏజెన్సీలు సాధ్యమైనంత ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పంటలను ఈ దుర్ఘటనల నుంచి కాపాడే నైపుణ్యం ఎంతో ముఖ్యం. తుఫాన్ల నుంచి చాలా తక్కువ నష్టాలతో బయటకు వచ్చే వ్యూహాత్మక నిర్ణయాలు ప్రస్తుతం ఎంతో అత్యవసరంగా మారాయి. అదేవిధంగా తుఫాను తర్వాత నష్టపరిహారాలను క్రమపద్ధతిలో సత్వరం నిర్ణయించే ప్రభుత్వ ఏజెన్సీలు, క్షేత్రస్థాయిలో ఆ పరిహారాలను అందేలా తీసుకోవాల్సిన చర్యలు నిర్ణయాత్మకంగా మారాయి. 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' (పంట ఇన్సూరెన్స్) పథకాన్ని కేంద్రం పదేళ్ల క్రితం మొదలు పెట్టింది. కానీ ఆ పథకం వినియోగం క్షేత్రస్థాయిలో అంతంతమాత్రంగానే ఉన్నది. వాతావరణ మార్పుల వల్ల, ప్రకృతి వైపరీత్యం వల్ల సంభవించే నష్టాలను తీర్చటానికీ, రైతులకు సాయపడటానికీ ఉద్దేశించిన ఈ పథకం అమలు అనుకున్న రీతిలో సాగటం లేదు. రైతులందర్నీ ఈ పథకం కింద చేర్చగలిగితే నష్టపోయిన రైతులకు కొంతలో కొంత ఊరట లభిస్తుంది. రాష్ట్రాలు తమ వంతుగా ఈ పథకాన్ని రైతుల్లోకి తీసుకొనిపోవాలి. క్షేత్రస్థాయిలో రైతులకు ఊరట కలిగించే విధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. మొదట్లో ఇచ్చిన నష్టపరిహారాలను ప్రభుత్వాలు తిరిగి వసూలు చేసే ఆలోచన ఉండేది కాదు. కానీ 15వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసు ప్రకారం రెండేళ్ల క్రితం జాతీయ, రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్సు నిధులను రిలీఫ్ నిధులుగా లెక్కించకుండా, రికవరీ చేయటం ఈ స్కీములో భాగంగా మారింది. ఇది ఎంతవరకు సమంజసమో ప్రభుత్వాలు ఆలోచించాలి. ప్రకృతి వైపరీత్యాలు దారుణమైన రీతిలో రాష్ట్రాలను అతలాకుతలం చేసి, జీవన విధానాన్ని దుర్భర స్థితిలోకి నెట్టివేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం తనవంతు అత్యవసర ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాలా ఆదుకునే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఆ విధంగా చర్యలు తీసుకున్నప్పుడే ఫెడరలిజానికి ఒక అర్థమూ, ప్రయోజనమూ ఉంటాయి. 'సహకార ఫెడరలిజం'ను- ఇచ్చిపుచ్చుకునే తీరులో నిర్వహించగలిగినప్పుడే కేంద్రం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడినట్టు!

హమాలీ సంఘం సీనియర్ నాయకులు కొలిపాక మల్లయ్య మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్.

తెహెల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

హమాలీ కార్మికుల హక్కులకోసం అనేక సంవత్సరాల పాటు నిరం తరం కృషిచేసిన సీనియర్ కార్మి కనాయకులు కొలిపాక మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడం కార్మిక ఉద్యమానికి తీరని లోట ని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్ అన్నారు. కొలిపాక మల్లయ్య ఏఐటీయూసీ ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఉపాధ్యక్షులుగా, సివిల్ సప్లై హమాలీ యూనియ న్ ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శిగా అనేక సంవత్సరాల పాటు కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం, హమాలీ కార్మికుల హక్కుల సాధన కోసం విశేష సేవలందించారని కొనియా డారు. కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. కొలిపాక మల్లయ్య మృతి పట్ల ఏఐటీయూసీ యాదాద్రి భువన గిరి జిల్లా కమిటీ పక్షాన ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా భువనగిరి పట్ట ణంలోనికొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు వద్దఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. తరువాత హుస్నాబాద్‌లోని ఆయన స్వగృహానికి చేరుకొని పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి



ఆయనచేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హ మాలి యూనియన్ జిల్లాఅధ్యక్షు లు పల్లె శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పాపగళ్ల శంకరయ్య,నాయకులు బండ స్వామి,పిన్నం జగన్, ముదిగొండ బసవయ్య,గణేష్, మైసయ్య,రాజు,స్వామి,జహంగీర్,వంశీ,కర్ణాకర్,వెంకట్, సత్యనారాయణ, పాండు, శాంతమ్మ,శారద,శోభ,అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి మార్కెట్లోకి వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- రైతు సంఘం ఆల్ ఇండియా మహాసభలు జయప్రదం చేయండి.
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు.

తెహెల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

రాష్ట్ర ప్రభు ప్రభుత్వాలు ఐకెపి సెంటర్లు మార్కెట్లలోకి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఈనెలలో జరుగుతున్న మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బొమ్మలరామారం మండల పరిధిలో ఉన్న రామలింగంపల్లి ఐకెపి సెంటర్ వద్ద ఆల్ ఇండియా మహాస భల జయప్రదం చేయాలని కర పత్రాలు పంచుకు ప్రచారం నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయని ఐకె పి సెంటర్లకు రైతులు పండించిన పంటను ఐకెపి సెంటర్లకు మార్కె ట్లకు తీసుకొచ్చి వారం రోజులు అవుతున్న నేటికీ కొనుగోలు చే యడం లేదని మిల్లర్లతో నేటికీ మీటింగ్ పెట్టి కొనుగోలు చేయ డంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్ర భుత్వం నిర్లక్ష్యం చేస్తున్నరని రైతులు అప్పులు చేసి పంటలు పండించి ఐకెపి సెంటర్లకు మార్కెట్లోకి తీసుకొస్తే వెంటనే కొనుగోలు చేయకుండా ప్రభుత్వాలు మధ్య దళారులకు కుమ్మక్కై రైతులను పట్టించుకోవడంలేదని ఈనెల 15 నుండి18 వరకురైతు సంఘం ఆల్ ఇండియా మహాస భలు జరుగుతున్నాయని ఈ మహాసభలో రైతుల ఎదురవు తున్న సమస్యలు చర్చించి



ప్రభుత్వ అవలంబిస్తున్న రైతు వ్యతి రేక విధానాల మీద పోరాటాలకు సిద్ధం చేయడం కోసం జరుగుతు న్న మహాసభలను జయప్రదం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శివ్యకల శ్రీశైలం నాయకులు సత్యనారాయణ వెంకటేశం యాదగిరి బాలయ్య దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- సమర్థవంతమైన దర్యాప్తుతో నిందితుడు ఈ.రాజశేఖర్‌కు శిక్ష పడేలా చేసిన అల్వాల్ పోలీసులు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అత్యాచారం మరియు పోక్సో చట్టం కింద నమోదైన కేసులను వేగంగా విచారించే ప్రత్యేక కోర్టు , అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసు (Cr.No. 596/2019)లో నిందితుడు ఎటికెల రాజశేఖర్ (27) దోషి అని నిర్ధారించింది. అతనికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, 6,500 జరిమానా మరియు బాధితుడికి 3,00,000 పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. 15.12.2019 రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో, నిందితుడు తన ఇంటి సమీపంలో స్నేహితులతో ఆడుకుంటున్న 10 ఏళ్ల బాలుడిని బలవంతంగా ఒక ఇంట్లోకి తీసుకెళ్లి, దాడి చేసి, దుస్తులు తొలగించి, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, అల్వాల్ పోలీసులు కీలకమైన సాక్ష్యాధారాలను సేకరించారు. బాధితుడి వయస్సును ధృవీకరించేందుకు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాన్ని కోర్టుకు సమర్పించారు. ఘటనకు ముందు బాధితుడితో కలిసి ఆడుకున్న ఇతర పిల్లల వాంగ్మూలాలను నమోదు చేయడం ద్వారా బలమైన సాక్ష్యాలను సేకరించారు. గాంధీ ఆసుపత్రి నుండి పొందిన వైద్య పరీక్షా నివేదిక కూడా బాధితుడి వాంగ్మూలానికి మద్దతుగా నిలిచింది. ఈ కీలక సాక్ష్యాధారాలు నిందితుడి నేరాన్ని కోర్టు ముందు నిరూపించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో మొదటి దర్యాప్తు అధికారి, ఇన్‌స్పెక్టర్ పి. యాదగిరి; రెండవ దర్యాప్తు అధికారి, ఏసీపీ ఏ.వి.ఆర్. నరసింహారావు; మరియు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ ప్రభాకర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. పిల్లల పై జరిగే నేరాల పట్ల చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి పోలీసులు స్పష్టం చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టడం, సాక్ష్యాధారాలతో నేరాన్ని నిరూపించడం మరియు



బాధితులకు న్యాయం చేకూర్చడంలో తాము నిబద్ధతతో ఉన్నామని వారు పేర్కొన్నారు. పిల్లల భద్రత చర్చించబడదు.

మల్కాజ్‌గిరి పోలీస్ కమీషనరేట్

నవ్య స్కూల్లో ఘనంగా దీపావళి వేడుకలు..

రాముని అయోధ్య పునరాగమనం ప్రదర్శన

హైదరాబాద్ : నవంబర్ 06

బాగ్ అంబర్‌పేటలోని నవ్య ప్లేస్కూల్లో దీపావళి పండుగను పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిత్య ప్లే స్కూల్ లో దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. "రాముని అయోధ్యకు తిరిగి రాక" అనే అంశం పై చిన్నారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత, ప్రాముఖ్యత, పండుగ వెనుక ఉన్న పౌరాణిక నేపథ్యాన్ని తెలియజేస్తూ చిన్నారులు నాటక రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల నటన, సందేశాత్మక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నవ్య స్కూల్ చైర్మన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని తెలిపారు. శ్రీరాముడు రావణుడి పై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి ఆనందోత్సాహాలతో స్వాగతం



పలికారని, అప్పటి నుంచి దీపావళి పండుగకు విశేష ప్రాధాన్యత ఏర్పడిందని వివరించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి అని పేర్కొన్నారు.విద్యార్థులు పండుగల విశిష్టతను తెలుసు కోవడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను గౌరవించాలని సూచించారు. పండుగల ను ఆనందంగా జరుపుకుంటూనే పర్యావరణ పరి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా పర్యావరణహిత దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహం గా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

పీజీ వైద్య విద్యలో సత్తాచాటిన డా.ఎదునూరి ప్రశాంత్ 61 శాతం మార్కులతో ఉత్తీర్ణత

తెహల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

వైద్య విద్యలో భువనగిరి మండల అనాజిపురం గ్రామానికి చెంది న డా. ఎదునూరి ప్రశాంత్ అద్భుత ప్రతిభ చాటుకున్నాడు. కుమ్మరిసామాజిక వర్గానికి చెందిన ఎదునూరి ప్రశాంత్ వైద్యవిద్యలో పీజీ పూర్తి చేసి విజయాన్ని అందుకున్నాడు. ఈ నెల 5న విడుదలైన పరీక్షా ఫలితాల్లో 61 శాతం మార్కులు సాధించి ఉత్తీ ర్ణులయ్యారు. అనాజిపురం గ్రామమాజీ సర్పం చ్ ఏదునూరి ప్రేమలత మల్లేశం దంపతుల కుమారుడైన ప్రశాంత్ జనరల్ సర్జరీ పూర్తి చేశారు. 2023లో నిర్వహించిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాజీవ్ గాంధీ మె డికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బెంగళూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న సప్తగిరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బెంగళూరులో పీజీ సిట్ పొందాడు. మూడేళ్లపాటు వైద్య విద్యలో శిక్షణ పొందిన అనంతరం గత నెలలో పరీక్షలకు హాజరై తాజాగా విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. వైద్య విద్యలో పీజీ పూర్తి చేసి వైద్య నిపుణులుగా ఎదగడం పట్ల అనాజిపురం గ్రామస్తులు ,పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ కుమారుణ్ణి అభినందించగా, గ్రామానికి చెందిన పలువురు భవిష్యత్తులో డా.ప్రశాంత్ ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుకున్నారు.



వెబ్ సైట్ సభ్యత్వం ద్వారా మున్నూరు కాపుల సంఖ్య బలం తెలియజేయాలి

- సూర్యాపేట జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు (పటేల్స్) సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వెబ్ సైట్ పోస్టర్ ఆవిష్కరణ
- సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్

సూర్యాపేట, నవంబర్6(తెహల్క న్యూస్)

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ల సంఖ్యా బలాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 28 లక్షలు గా చూపించడం జరిగిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో మున్నూరు కాపుల జనాభాని 13 లక్షలగా చూపించిందని ఇట్టి విషయంపై తెలంగాణ రాష్ట్రంలోని మున్నూరు కాపులందరూ ఐక్యతతో నిజ నిజాలను తెలియజేసేందుకు మున్నూరు కాపు వెబ్ సైట్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకొని మున్నూరు కాపుల సంఖ్య బలాన్ని తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు(పటేల్స్) సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట కేంద్రంలో ఏర్పాటుచేసిన మున్నూరు కాపు (పటేల్స్)సంఘం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపులకు అన్ని పార్టీలు రాజకీయంగా ప్రాధాన్యత పెంచాలని, గతంలో మున్నూరు కాపులకు అధిక ఎమ్మెల్యే స్థానాలు ఉండేవని వాటిని తగ్గించుకుంటూ మున్నూరు కాపులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 11న యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ మున్నూరు కాపు అన్నదాన సత్రంలో సూర్యాపేట జిల్లా ముఖ్య నాయకులతో ఎలక్షన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈ సమావేశానికి ప్రతి నియోజకవర్గ నుండి 20 మంది చొప్పున హాజరుకావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, యువక మండలి రాష్ట్ర అధ్యక్షులు రాజ్ కుమార్ సూర్యాపేట జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ శ్రీనివాస నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల శ్రీనివాస్, కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు శెట్టి విజయభాస్కర్, జిల్లా గౌరవ సలహాదారులు దంతాల రాంబాబు, డేగల రమేష్, రామసాని రమేష్, ఏనుగులవీరాంజనేయులు, ఎన్ సత్యనారాయణ, దంతాల పద్మ రేఖ, సందీప్, ఇంద్ర శేఖర్, సకినాల కృష్ణ, జానకి రాములు, త్యాగరాజు, ప్రవీణు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కూచిపూడి దేవాలయాలకు ధాతల భారీ విరాళాలు...

- దేవాలయాలకు గ్రానైట్ , దాతలు సహాయం అభినందనీయం...

కోదాడ ,నవంబర్ 6(తెహల్ న్యూస్)

కోదాడ మండలం, కూచిపూడి గ్రామంలో అంతరగంగా వాగు పక్కన శెట్టి వారి వంశస్థుల దైవభూమి నందు నిర్మాణంలో ఉన్న నూతన ఆలయాలు శ్రీ సీతారామాంజనేయ స్వామి,శ్రీ అభయాంజనేయ స్వామి,శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, షిర్డీ సాయి బాబ, శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానాలు ప్రతిష్టా మహోత్సవాలకు ముస్తాభవుతున్నాయి.అందులో భాగంగానే దేవాయలయాలకు గ్రానైట్ ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కందికొండ సాయిబాబు మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి గ్రానైట్ దాతగా శ్రీ గుండం రాజేష్ రెడ్డి తండ్రి రమణారెడ్డి 10 టన్నులు, మరియు శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయానికి గంధం గోవిందరావు తండ్రి వీరయ్య 10 టన్నులు, షిర్డీ సాయిబాబ ఆలయానికి గ్రానైట్ దాతగా శ్రీ గంధం సుధీర్ నాయుడు తండ్రి వెంకటేశ్వర్లు 10 టన్నులు,శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు గ్రానైట్ దాతగా శ్రీ శెట్టి బాబు తండ్రి బజారయ్య 10 టన్నులు, మొత్తంగా అందరూ కలిసి కూచిపూడి దేవాలయాలకు 40 టన్నుల గ్రానైట్ దాతలుగా ముందుకు రావడం అభినందనీయమని అదేవిధంగా ఈ గ్రానైట్ ట్రాన్స్ పోర్ట్ కోసం శ్రీ పద్మావతి ట్రాన్స్ పోర్ట్ అధినేత ఆకుల శేఖర్ లారీ ఏర్పాటు చేసి ఖమ్మం నుండి కూచిపూడి దేవాలయాలకు చేర్చినందుకు వారి కుటుంబాలకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ దేవాలయాల నిర్మాణ మహాయజ్ఞంలో దాతలు తమ వంతు సహాయ సహకారాలు విరాళాలుగా అందించి దైవకృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము అన్నారు.ఈ కార్యక్రమంలో కూచిపూడి మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు, దాతలు గుండం రాజేష్ రెడ్డి,గంధం గోవిందరావు, గంధం సుధీర్ నాయుడు, శెట్టి నరేష్ నాయుడు, శెట్టి నర్సింహారావు, శెట్టి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రభాత్ నగర్ పార్కులో గేటు నిర్మాణానికి అనుమతించేది లేదు.

- పార్కు స్థలాన్ని కాపాడాలని జోనల్ కమిషనర్కు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వినతి.

ఎల్.బి.నగర్,నవంబర్ 06,తేహేల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

కాలనీవాసుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని పార్కు స్థలానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచన. ఎల్బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్ కాలనీ పార్కులో గేటు నిర్మాణం చేపడుతున్నారనే కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పందిం చారు. నిన్న మార్నింగ్ వాక్లో భాగంగా ప్రభాత్ నగర్ కాలనీ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులను పరిశీలించి కాలనీవాసుల అభ్యంతరాల ను తెలుసుకున్నారు.ఈ నేపథ్యంలో ప్రభాత్ నగర్ కాలనీవాసులతో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ని వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభాత్ నగర్ కాలనీ లేఅవుట్లో భాగంగా ఈ స్థలాన్ని ఓపెన్ స్పేస్గా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ పార్కులో చిన్నారులు, పెద్దలు ,మహిళలు ఉదయం,సాయంత్రం వాకింగ్తో పాటు యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు.అలాంటి పార్కులోకి హాస్పిటల్ నుంచి ప్రవేశించేందుకు గేటు ఏర్పాటు చేయడం వల్ల పార్కు వినియోగానికి కాలనీవాసుల ప్రశాంతతకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. బదులుగా కేవలం 13 అంతస్తులకే నిర్మాణాలు చేపట్టిందని విమర్శించారు.ప్రభాత్ నగర్ పార్కు కాలనీవాసుల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్ అని,దాని స్వరూపాన్ని మార్చే విధంగా ఎలాంటి నిర్మాణాలు లేదా గేట్ల ఏర్పాటు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పార్కు స్థలాన్ని కాపాడుకోవడానికి కాలనీవాసులతో కలిసి పోరాడుతామని ఎట్టి పరిస్థితు ల్లోనూ పార్కు స్థలానికి నష్టం కలగనివ్వబోమని ఎమ్మెల్యే సుధీర్రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిబ్లక్‌పల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



తెహల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన 36 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ నాణ్యతతో పాటు తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా అవసరమైన మౌలిక సదు పాయాలు కల్పించి ఇళ్ల పంపిణీకి సంబంధించి అ వసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఘనంగా జిల్లా యువజన ఉత్సవాలు.

యువతే దేశానికి వెన్నె ముక : చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీ వాణి రవికుమార్



తెహల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

భువనగిరిజిల్లా యువజన సర్వే సులు మరియు క్రీడలశాఖ ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక భువనగిరి ఫోర్ట్ దగ్గర నిర్వహించిన జిల్లా యువజన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాల ని,యువతే దేశానికి వెన్నెముక లాంటి వారని అన్నారు. యువతలో దాగి ఉన్న కళా, సాం స్కృతిక, క్రీడా ప్రతిభను వెలికితీ యడానికి ఈ యువజన ఉత్స వాలు ఒక మంచి వేదిక అని, లక్ష్యంపై గురి పెడితే సాధించలే నిది ఏదీ లేదని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూ రంగా ఉండి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో,జానపద నృత్యా లతో,సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారులు మరియు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి నీటి నాణ్యత పై రాజీ వద్దు: ఎండీ అశోక్ రెడ్డి



హైదరాబాద్ తెహల్కా న్యూస్ 6-11-2026

నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీలను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి గురువారం సందర్శించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యతపై రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. శుద్ధి నీరు పునర్వినియోగ ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో నిరంతరం పరీక్షించాలని, BOD, COD, TSS, pH పారామీటర్లను క్రమం తప్పకుండా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్లను మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, ట్యాంకర్ల రాకపోకలకు అంతర్గత రహదారులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలని, బౌల్డర్ హిల్స్ పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి ఎస్టీపీ వద్ద నాణ్యత వివరాలు కనిపిం చేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, నిర్మాణ రంగం తాగేతర అవసరాలకు శుద్ధి నీటినే వాడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ పట్నీ సెంటర్‌లో ఉర్వశి రాయల్ ఏసీ బ్యాంక్వెట్ హాల్ ఘన ప్రారంభం

– అందుబాటు ధరల్లో అన్ని శుభకార్యాలకు అత్యుత్తమ వేదిక – ఎండీ పి. వేణు కుమార్

తెహెల్కా న్యూస్ సికింద్రాబాద్, నవంబర్ 6:

పాట్నీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉర్వశి రాయల్ ఏసీ బ్యాంక్వెట్ హాల్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మేనేజింగ్ డైరెక్టర్ పి. వేణు కుమార్, భాగస్వామి కె. వెంకట నారాయణ పాల్గొని అతిథులకు స్వాగతం పలికారు. దివంగత కలేరు శ్రీనివాస్ వంజారి ఆశీస్సులతో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎండీ వేణు కుమార్ మాట్లాడుతూ తమకు ఈ రంగంలో 25 ఏళ్ల అనుభవం ఉందని, తొలిసారిగా సొంతంగా పట్నీ సెంటర్‌లో బ్యాంక్వెట్ హాల్‌ను ప్రారంభించామని తెలిపారు. నగర నడిబొడ్డున అందరికీ అందుబాటులో, బడ్జెట్‌కు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో ఏర్పాటు చేశామన్నారు. 50 మంది నుంచి 550 మంది వరకు వేడుకలు నిర్వహించుకునే సదుపాయం ఉందని, వివాహాలు, పుట్టినరోజులు, కుటుంబ కార్యక్రమాలు, సమావేశాలకు అనువుగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. వినియోగ దారుల బడ్జెట్‌కు ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన సేవలను సరసమైన ధరలకు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కుమార్తె సోనాలి మాట్లాడుతూ ప్రతి



కుటుంబం బడ్జెట్‌లోనే వేడుకలు జరుపుకునేలా తీసుకొచ్చామని, నగరానికి దూరంగా వెళ్లాల్సిన అవసరం లేకుండా నగరం మధ్యలోనే ఉందని, బస్సు, మెట్రో, MMTS ద్వారా సులభంగా చేరుకోవచ్చని, పార్కింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. వచ్చిన అతిథులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు వేణు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


బంగారం ధరలు


manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,43,450	10gms
22 kt	₹	1,31,500	10gms
SILVER	₹	1,89,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

జనవరి 23న అతి భారీ బాక్సింగ్ ఈవెంట్

తెహెల్కా న్యూస్ హైదరాబాద్, నవంబర్ 6:

భారత్‌లోనే అతిపెద్ద ప్రొఫెషనల్ బాక్సింగ్ ఈవెంట్‌కు ముందు నీరజ్ గోయట్, మాజీ UFC ఛాంపియన్ ఆంథోనీ పెటిస్ హైదరాబాద్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తొలిసారి ముఖాముఖిగా తలపడ్డారు.పోరాటం 2027 జనవరి 23న జరగనుంది. IPBL, IBC, MVP సంయుక్త కాన్ఫరెన్స్‌లో MVP సహ వ్యవస్థాపకుడు జేక్ పాల్ వీడియో సందేశం సర్‌ప్రైజ్ ఇచ్చింది. ‘‘ఈ పోరాటాన్ని చెన్నైకి తీసుకురావాలని ఉంది. 47 ఏళ్ల క్రితం మహమ్మద్ అలీ ఇదే నగరంలో బాక్సింగ్ ప్రదర్శన ఇచ్చారు. ఇది భారత బాక్సింగ్‌కు అతిపెద్ద పునరాగమనం అవుతుంది’’ అని కోరారు. 1980 జనవరిలో చెన్నై నెహ్రూ స్టేడియంలో అలీ పోరాడారు. హైదరాబాద్, వైజాగ్, చెన్నై ఆతిథ్యానికి పోటీలో ఉన్నాయని, త్వరలో నగరాన్ని ప్రకటిస్తామని IPBL CEO అక్షర్ మాధవరం తెలిపారు. “జనవరి 23 ఖరారైంది. ఇంత భారీ ఈవెంట్‌ను భారత్ ఇప్పటివరకు చూడలేదు” అని అన్నారు. గోయట్ – “గతసారి టెక్సాస్ నుంచి ప్రపంచం చూసింది, ఈసారి స్వదేశంలో నా ప్రజలు



చూస్తారు. బాక్సింగ్ రింగ్‌లో నన్ను ఎవరూ ఓడించలేరు’’ అని ధీమా వ్యక్తం చేశారు. పెటిస్ – “నేను ఈ లీగ్‌లో యజమానిని. 15 ఏళ్లుగా ప్రపంచ ఛాంపియన్లతో పోరాడాను’’ అని సవాల్ చేశారు.

గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, మహిళా గౌరవానికి భంగం కలిగించే ఘటన

– గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాధారణ గాయాలు మరియు నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన కేసు

– (A1) వేణుగోపాల్ తోష్నివాల్, (A2) స్వప్న

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

హైదరాబాద్, గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్: 346/2026 (BNS సెక్షన్లు 74, 115(2), 351(2), 292 మరియు 3(5) ప్రకారం) కేసులో, హత్యాయత్నం, మహిళా గౌరవానికి భంగం కలిగించడం, సాధారణ గాయాలు చేయడం మరియు నేరపూరిత బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిందితుల వివరాలు:

(A1) వేణుగోపాల్ తోష్నివాల్, తండ్రి: దివంగత బ్రిజ్ గోపాల్ తోష్నివాల్, నివాసం: బెద్వార్‌వాడి, బేగం బజార్, హైదరాబాద్., (A2) స్వప్న, భర్త: వేణుగోపాల్ తోష్నివాల్, నివాసం: బెద్వార్‌వాడి, బేగం బజార్, హైదరాబాద్. (నిందితులు A1 మరియు A2లను 17.09.2026న మధ్యాహ్నం 3:30 గంటలకు అరెస్టు చేసి, గౌరవనీయులైన కోర్టు ముందు హాజరుపరుస్తున్నారు.) (A5) శ్రీమతి శశికళ మరియు ఇతర వ్యక్తులు (పరారీలో ఉన్నారు)

సంఘటన వివరాలు:

16-09-2026న ఉదయం సుమారు 11:55 గంటలకు, ఫిర్యాదుదారు శ్రీ ఉమేష్ కుమార్ తోష్నివాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బేగం బజార్ ఛత్రి వద్ద ఉన్న తన దుకాణం దగ్గర మట్టి సంచులను ఉంచే విషయంలో, తన సోదరుడి భార్య స్వప్న మరియు ఆమె తల్లితో గొడవ జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ గొడవ సమయంలో, వేణుగోపాల్, స్వప్న మరియు ఆమె తల్లి కలిసి తన మెడను పట్టుకుని దాడి చేశారని, అడ్డువచ్చిన తన కుమార్తె ఏక్తా, తన భార్య మరియు ఇతర వ్యక్తులపై కూడా దాడి చేసి గాయపరిచారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులు బాధితులను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించి, గొడవకు దిగారు. దీనిపై ఫిర్యాదుదారుడు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గోషామహల్ పోలీసులు ఈ ఘటన పై Cr.No. 346/2026 కింద, BNS సెక్షన్లు 74, 115(2), 351(2), 292 మరియు 3(5) ల ప్రకారం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా, ఈ కేసులో నిందితులు గా ఉన్న A-1 మరియు A-2 తమ దుకాణం వద్ద ఉన్నారనే నమ్మదగిన



సమాచారం పోలీసులకు అందింది. వెంటనే గోషామహల్ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, తామే ఈ నేరానికి పాల్పడినట్లు వారు అంగీకరించారు. నిందితులు A-1 మరియు A-2 గతంలో కూడా ఇతర నేరాల్లో ప్రమేయం కలిగి ఉండటంతో, పోలీసులు వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. గోషామహల్ పోలీసులు చేపట్టిన ఈ త్వరితగతిన చర్య, శాంతిభద్రతలను కాపాడటంలో మరియు ప్రజల భద్రతను నిర్ధారించడంలో హైదరాబాద్ నగర పోలీసుల నిబద్ధతను తెలియజేస్తుంది. ఇటువంటి చట్టవిరుద్ధమైన మరియు అశాంతిని కలిగించే పనులకు పాల్పడే వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది, చట్టప్రకారం తదుపరి చర్యలు ఉంటాయి.

ప్రజలకు విజ్ఞప్తి

గోషామహల్ పోలీసులు ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తున్నారు: ఆస్తులు, వ్యాపారాలు లేదా ఇతర వ్యక్తిగత వివాదాల విషయంలో శాంతిని పాటించండి, భౌతిక దాడులకు దిగొద్దు. ఇటువంటి సమస్యలను చట్టబద్ధమైన మరియు శాంతియుత మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలి. ఎవరూ కూడా ఇతరుల పై దాడి చేయడం, బెదిరించడం, దూషించడం, గొడవలు సృష్టించడం లేదా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు. ఏదైనా వివాదం ఎదురైనా లేదా ఎవరైనా మిమ్మల్ని బెదిరించినా, వెంటనే పోలీసులను ఆశ్రయించి తగిన చట్టపరమైన సహాయం పొందండి.

సొంతింటి కల ఆలస్యం చేస్తే వినూత్న పోరాటాలకి సిద్ధం

- సిఐటియు

తెహెల్కా న్యూస్, నవంబర్06 మందమర్రి:

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటి యు ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణాపూర్ సిహెచ్ పి లోని కార్మికులతో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాజేందర్,బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చకపోతే కార్మికులందరినీ ఏకం చేస్తూ మరో తరహా వినూత్న పోరాటానికి సిద్ధం చేస్తామ న్నారు. లాభాల వాటా ప్రకటన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రస్తావించిన సమస్యల న్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెం బర్ లో ఇవ్వాల్సిన యాక్టింగ్ ప్రమోషన్స్ ఇప్పటి వరకు ఇవ్వకపోయినా గుర్తింపు సంఘం స్పందిం చకపోవడం విడ్డూరమన్నారు.గత ఆర్థిక సంవత్సరం సీఎంపిఎఫ్ నిల్వను ఎందుకు చూపెట్టడం లేదో యాజమాన్యం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి ఆర్థికంగా నష్టం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమ డివిడెంట్ తీసుకొని చూస్తూ ఊరుకోవడం సరైన విధానం కాదని దేశవ్యా ప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికుల12వ వేతన ఒప్పం దంపై తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి గా ఉన్నప్పటికీ స్పందించకపోవడం సరైనది కాద న్నారు. సంస్థ ఆర్థిక నష్టం కలిగిస్తూ కార్మికులకు రావాల్సిన రక్షణ పరికరాలను సప్లై చేయలేని స్థితికి తీసుకువచ్చిన రాజకీయ జోక్యాన్ని కార్మికులు గమనిం చాలని కార్మికులను కోరారు. కెసిఆర్



ప్రభుత్వం తరహాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా సింగరేణి ఆర్థిక లోటి చేస్తే రానున్న ఎన్నికల్లో తప్పకుండా ప్రతి ఘటన ఎదుర్కొక తప్పదని ఇప్పటికైనా సంస్థలో ఆర్థిక దోపిడిని నివారించి రావాల్సిన బకాయిలను ఇవ్వాలన్నారు.ఇటీవల పెన్షన్ పై,బోనస్ పై ఏఐటి యుసి నాయకులు చేస్తున్న ఆరోపణలను కార్మికులు నమ్మరని, పెన్షన్ బోర్డు లోటు భర్తీకి కోసం సీఐటీ యూ చేసిన ప్రతిపాదనలతోనే కొంచెం నిలదొక్కు కోగలిగిందని, ఆ విషయం మీ పెన్షన్ బోర్డు సభ్యు లను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్మికులలో యూ నియన్ చేస్తున్న నిస్వార్థ పోరాటాలకు పెరుగుతున్న ఆదరణ తట్టుకోలేక సిఐటియును విమర్శిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ,సెక్రటరీ గుజ్జ సతీష్,పిట్ ఇంచార్జ్ అయిందాల శ్రీనివాస్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్ రిహాబిలి టేషన్ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



తెహెల్కా న్యూస్ భువనగిరి 6-11-2026

పోచంపల్లి మండలం దేశముఖి గ్రామంలోని సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాలశా ఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా భువనగిరినియో జకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నల్గొండపార్ల మెంట్ సభ్యులు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వవిప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి యూనివ ర్సిటీని సందర్శించారు.

బాధిత కుటుంబానికి అండగా సుధా బ్యాంక్, రూ. 5.39 లక్షల ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెక్ అందజేత



కోదాడ: నవంబర్ 6(తెహల్కా న్యూస్)

బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఇన్సూరెన్స్ ఎంతగానో తోడ్పడుతుందని సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ పేర్కొన్నారు. కోదాడ సుధా బ్యాంక్ బ్రాంచ్‌లో 2023లో గృహ రుణం తీసుకున్న బానోత్ హతీరామ్ అనే వ్యక్తి ఇటీవల అక్టోబర్ నెలలో ప్రమాదవశాత్తు మరణించారు. రుణానికి సంబంధించి ఉన్న ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ. 5,39,000/- ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెక్‌ను మృతుడి భార్య బానోత్ సరితకు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పెద్దిరెడ్డి గణేష్ శు క్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ పెద్దిరెడ్డి.గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్న మొత్తంతో ఇన్సూరెన్స్ చేసుకోవడం ద్వారా జీవితానికి,తమ కుటుంబానికి కొండంత భద్రత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ మేనేజర్ చెన్నూరు రవి కుమార్,బ్యాంక్ సిబ్బంది భుస్సా నాగ మహేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ బల్మూరి పై నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గమైన చర్య కనకాల శివాజీ కురుమ

హైదరాబాద్:నవంబర్ 06



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మరియు వారి దంపతుల వైవాహిక జీవితానికి సంబంధించి నిరాధార ఆరోపణలు చేస్తూ, సమాజంలో ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకాల శివాజీ కురుమ తెలిపారు.రాజకీయాల్లో విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆయన పేర్కొన్నారు. కేవలం తమ పార్టీ నాయకుల మెప్పు పొందడం కోసం అసత్య ప్రచారాలకు పాల్పడుతూ, ఇతరుల గౌరవ మర్యాదలకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులపై విమర్శలు చేయాలంటే వాస్తవాలు, ఆధారాలతో మాట్లాడాలని, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తే చట్టపరమైన మార్గాల్లో ఎదుర్కొం టామని కనకాల శివాజీ కురుమ హెచ్చరించారు.

ఏలినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం

-నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి -- మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావు



తెహల్కా న్యూస్, నవంబర్ 06, నాగార్జునసాగర్ టౌన్:

నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీ ఏడవ వార్డులో కౌన్సిలర్ మైనంపల్లి జానకి వెంకటేష్ అధ్యక్షతన శుక్రవారం ఏలినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పుల ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్ నగర్ డిగ్రీ కళాశా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు



తెహల్కా న్యూస్ నవంబర్ 6 హుజూర్ నగర్

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ డిగ్రీ కళాశా విద్యార్థులు ఇటీవల కాలంలో జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో భాగంగా 2026 -27 సంవత్సరానికి గాను కామర్స్ విభాగం నిర్వహించిన పోటీలో పాల్గొనగా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు ఈ సందర్భంగా స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సోమవంగు రామారావు మాట్లాడుతూ మా హుజూర్ నగర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి పొందటం ఎంతో అభినందనీయమని కొనియాడారు విభాగ అధిపతిని బి నాగార్జున సాగర్ ను అప్రిషియేట్ చేస్తూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని తెలంగాణ రాష్ట్రంలోనే స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాల హుజూర్ నగర్ ను రెండో స్థానంలో నిలపడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు బహుమతులు పొందిన వారిలో ఆహ్లాద, లక్ష్మీ ,స్పందన, పావని మరియు సమీరా ఈ సందర్భంగా కామర్స్ విభాగ అధిపతి బి నాగార్జున సార్ ను కూడా అభినందించారు.

ఫీజులు తీసుకుని మైనర్ విద్యార్థినుల సర్టిఫికెట్లు ఆపేస్తారా



(హైదరాబాద్ నవంబర్6 తెహెల్క న్యూస్)

నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ పై సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి సీరియస్! 10వ తేదీలోగా బాలికల సర్టిఫికెట్లు అందేలా చూడాలి.. రాజేడీ కి స్పష్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం తప్పు తేలితే కఠిన చర్యలు తప్పవు ఇలాంటి వ్యవహారాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా.. బాధ్యులైన విద్యాసంస్థల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతా గద్వాల విజయలక్ష్మి

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లా పనితీరు మెరుగుపడాలి





తెహల్కా న్యూస్ నవంబర్ 6 యాదాద్రి భువనగిరి:

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగు పడాలని, విద్య, వివిజి రాంజీ పథకం, చేయూత పింఛన్ల పరిశీలన ప్రక్రియ, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.శుక్రవారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభి యాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని సీఎస్ సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్టంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.సమగ్ర శిక్ష అభియాన్, వి బి జి రాంజీ పథకాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.అన్ని పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలు అన్ని పాఠశాలల్లో నాణ్యతతో అమలయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

-తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత

వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీల్లో జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు. జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు, తదితర తాగునీటి మౌలిక సదుపాయాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచిం చారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సరఫరాలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

-వి బి జి రాంజీ ద్వారా నాణ్యమైన పనులు చేపట్టాలి

వి బి జి రామ్ జి పథకం అమలుపై మాట్లాడుతూ నవంబర్ నెలలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలు పనులు పొందుతున్నారని తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో నవంబర్ నెలలో సగటున 25 వేల మందికి మాత్రమే పనులు కల్పించగా, ప్రస్తుతం రోజుకు దాదాపు 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అవసర మైన కొత్త సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించి, తగిన హ్యాష్‌ట్యాగ్‌లతో ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

-ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన “మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి” కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ. 230 చొప్పున సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారుడికి రూ. 100 ప్రయోజనం కలుగుతుందని, మొత్తం సుమారు రూ. 50 వేల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని తెలిపారు. సబ్సిడీ సిమెంట్ బస్తాల ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనం పూర్తి స్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై స్పష్టమైన నివేదిక అందించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పంట కుంటల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ అంశాలను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, విద్యా శాఖ అధికారి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం

- 25 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెహల్కా న్యూస్,

అశ్వాపురం మండలంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను 25 మంది లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాలు పేద కుటుంబాలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ పథకాలు ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం ఫ్లెక్సీలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఫోటో గల్లంతు..!

.-కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారిన వైనం..



తెహల్కా న్యూస్ నవంబర్ 06,సూర్యాపేట:

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సన్నాహక సమావేశానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఫోటో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్వర్గీయ రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ముఖ్య అనుచ రుడిగా, సుమారు నాలుగు దశాబ్దాల రాజకీయ అను భవం కలిగిన నాయకుడిగా కొప్పుల వేణారెడ్డికి జిల్లా కేంద్రంలో, ప్రజల్లో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి నాయకుడి ఫోటో సమావేశ ఫ్లెక్సీలో లేకపోవడంపై సమావేశానికి హాజరైన కార్యకర్తలు, అభిమానులు, ముఖ్య నాయ కులు ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సమావేశం ప్రారంభంలోనే ఈ అంశం కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీకి అందించిన సేవలను పరిగణ నలోకి తీసుకోకుండా విస్మరించారా, లేక నిర్వాహకుల పొరపాటా అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి

బిజినెస్

2020 తర్వాత ఇదే అతిపెద్ద పతనం..
కుప్పకూలిన అమెరికా మార్కెట్లు.. కారణాలివే..!



అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ పతనం నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై పెట్టుబడులు, వాటి నుంచి ఆశించిన లాభాలపై ఆందోళనలు మదుపర్లను కలవరపెట్టాయి. దీంతో టెక్నాలజీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ముఖ్యంగా నాస్‌డాక్ సూచీ భారీగా పడిపోయింది. 2020లో కరోనా సంక్షోభం తర్వాత ఇంతటి పతనం ఇదే తొలిసారి. అమెరికాలో నెలకొన్న ప్రభావం ఆసియా మార్కెట్లకూ పాకింది. గురువారం ట్రేడింగ్‌లో నాస్‌డాక్-100 సూచీ 6 శాతానికి పైగా పతనమైంది. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 4.4 శాతం నష్టపోయింది. చిప్ కంపెనీల షేర్లను ప్రతిబింబించే ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ సూచీ ఏకంగా 12 శాతం పడిపోయింది. డోజోన్స్‌లోని మొత్తం 30 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఉన్న ఎన్విడియా షేరు 9 శాతానికి పైగా పడిపోయింది. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ఆ కంపెనీకి వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్న టెక్నాలజీ సంస్థల భవిష్యత్తుపై మదుపర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డేటా సెంటర్ల నిర్మాణానికి వందల బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఆదాయం వస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది.

ఏఐ దెబ్బ.. స్మార్ట్‌ఫోన్ల ధరలకు రెక్కలు! సామాన్యులపై భారీ భారం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా దూసుకెళ్తున్న వేళ, దాని ప్రభావం ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుపై పడనుంది. కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది చేదువార్త. రానున్న రోజుల్లో ఫోన్ల ధరలు, ముఖ్యంగా బడ్జెట్ ఆండ్రాయిడ్ ఫోన్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ పెరుగుదల ఏకంగా 30% వరకు ఉండొచ్చని ప్రముఖ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ జెఫరీస్ తన తాజా నివేదికలో హెచ్చరించింది. ఏఐ టెక్నాలజీకి గుండెలాంటి ప్రాసెసర్లు, మెమరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. జెమిని, చాట్‌జీపీటీ వంటి ఏఐ అప్లికేషన్ల కోసం టెక్ దిగ్గజాలు భారీ డేటా సెంటర్లను నిర్మిస్తున్నాయి. దీనికోసం మార్కెట్‌లోని మెమరీ చిప్‌లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుండటంతో స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలకు తీవ్ర కొరత ఏర్పడింది. ఫలితంగా, గతంలో 20 డాలర్లు (సుమారు రూ.1,680) పలికిన ఒక మెమరీ యూనిట్ ధర, ఇప్పుడు మూడు రెట్లు పెరిగి 60 నుంచి 65 డాలర్లకు (సుమారు రూ.5,000) చేరింది. ఈ ధరల పెరుగుదల ప్రభావం ముఖ్యంగా రూ.16,000 లోపు లభించే బడ్జెట్ ఫోన్లపైనే ఎక్కువగా పడనుంది. ఎందుకంటే, ఈ ఫోన్ల తయారీ ఖర్చులో దాదాపు 60% మెమరీ చిప్‌లదే ఉంటుంది. దీంతో పెరిగిన భారాన్ని కంపెనీలు తప్పనిసరిగా వినియోగదారులపై మోపేందుకు సిద్ధమవుతున్నాయి. ధరలు పెరగడంతో చాలా మంది కొత్త ఫోన్ల కొనుగోలును వాయిదా వేసుకోవడం లేదా సెకండ్ హ్యాండ్ (రీఫర్బిష్డ్) ఫోన్ల వైపు మొగ్గు చూపవచ్చని జెఫరీస్ అంచనా వేసింది. ఈ పరిణామాలతో ప్రపంచ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోనూ గణనీయమైన మార్పులు రానున్నాయి. 200 డాలర్ల



లోపు ఫోన్ల మార్కెట్ వాటా 42% నుంచి 24%కి పడిపోను ండగా, 600 డాలర్ల కంటే ఎక్కువ విలువైన ప్రీమి యం ఫోన్ల వాటా 29% నుంచి 38%కి పెరుగుతుందని నివేదిక తెలిపింది. తయారీ వ్యయాన్ని తగ్గించుకోవడానికి కొన్ని కంపెనీలు కొత్త ఫోన్లలో పాత తరం ప్రాసెసర్లను వాడే అవకాశం ఉందని, అలాగే తక్కువ ధర మోడళ్ల సంఖ్యను తగ్గించుకునే యోచనలో ఉన్నాయని పేర్కొంది. ఏఐ కంపెనీలు 2027 నాటికి సుమారు 1.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నందున, మెమరీ చిప్‌ల ధరలు 2027 మధ్యకాలం వరకు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగవచ్చని జెఫరీస్ స్పష్టం చేసింది.

ట్రావెల్స్ వ్యాపారులకు టయోటా గుడ్‌న్యూస్.. ఇన్నోవా క్రిస్టా లిమో వచ్చేసింది!

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత మార్కెట్లోకి కొత్త ఇన్నోవా క్రిస్టా లిమో వేరియంట్‌ను తీసుకొచ్చింది. ప్రధానంగా టాక్సీ, ట్రావెల్స్ సంస్థలు, ఇతర వాణిజ్య వాహన నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని దీన్ని రూపొందించింది. ఏడు సీట్ల వెర్షన్ ధరను రూ.19.95 లక్షలుగా, ఎనిమిది సీట్ల వెర్షన్ ధరను రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. ఇవి ఎక్స్‌షోరూమ్ ధరలు. ఇన్నోవా క్రిస్టా లిమోను ప్రత్యేకంగా జీఎక్స్-ఎస్ఎల్ఎఫ్ గ్రేడ్‌లో అందిస్తోంది. సాధారణ ఇన్నోవాతో పోలిస్తే ఇంజిన్, గేర్‌బాక్స్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ సీట్లను కూడా అందిస్తోంది. రెండో వరుసలో వ్యక్తిగత సీటింగ్‌కు ప్రాధాన్యమిచ్చే వారు ఏడు సీట్ల వెర్షన్‌ను ఎంచుకోవచ్చు. అదనంగా మరో ప్రయాణికుడికి చోటు కల్పించేలా ఎనిమిది సీట్ల వెర్షన్‌ను రూపొందించింది. ఈ వాహనంలో 2.4 లీటర్ల నాలుగు సిలిండర్ల డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. దీనికి మాన్యువల్ గేర్‌బాక్స్‌ను జత



చేశారు. సాధారణ ఇన్నోవా క్రిస్టా గరిష్ఠంగా లీటరుకు 15 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ ధ్రువీకరించింది. సుదూర ప్రయాణాలు, తరచూ ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య అవసరాలకు ఇది అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. కొనుగోలుదారులకు మూడేళ్లు లేదా లక్ష కిలోమీటర్ల వరకు ప్రామాణిక వారంటీ లభిస్తుంది. అదనపు మొత్తంతో ఐదేళ్లు లేదా 2.20 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీని పొడిగించుకోవచ్చు. ఏడేళ్ల వరకు ఫైనాన్స్ సదుపాయాలు, తక్కువ ఈఎంఐ పథకాలు, త్వరిత సర్వీసింగ్, 24 గంటల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సదుపాయాలను కూడా టయోటా అందిస్తోంది.

బీహార్ సీనియర్ జట్టుకు తొలిసారి కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలిసారి బీహార్ సీనియర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లకు అతడిని సారథిగా నియమించారు. సూరజ్ కశ్యప్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. శుక్రవారం బీహార్ క్రికెట్ అసోసియేషన్ (బీజూ) 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. వైభవ్ ఇండియా ఏ జట్టుతో చేరాల్సి ఉండటంతో, కేవలం రెండు మ్యాచ్‌లకే కెప్టెన్సీ ఇచ్చారు. నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహాలో జరిగే 50 ఓవర్ల మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో అతడు ఆడనున్నాడు. బీజూ అధ్యక్షుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ, ఈ బాధ్యత వైభవ్ ఆటగాడిగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు. "వైభవ్ ఇప్పటికే చిన్న వయసులోనే అపారమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసం, పరిణతిని చూపించాడు. ఈ బాధ్యత క్రికెటర్‌గా, నాయకుడిగా ఎదగడానికి అతడికి మరో అవకాశం ఇస్తుంది. వైభవ్ నాయకత్వంలో జట్టు క్రమశిక్షణతో, పోటీతత్వంతో, సమర్థవంతమైన ప్రదర్శన ఇస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన చెప్పారు. 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో 175 పరుగులు చేసి భారత్‌కు కప్ అందించిన వైభవ్, టోర్నీ ప్లేయర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 237.30 స్ట్రైక్ రేట్‌తో 776 పరుగులు చేసి టాప్ స్కోరర్ అయ్యాడు. జులైలో మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో రెండో టీ20తో అరంగేట్రం చేసి, భారత్ తరఫున అతి పిన్న వయసు అంతర్జాతీయ క్రికెటర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో ఇటీవలి మూడో టీ20లో అభిషేక్ శర్మతో కలిసి తొలి 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించాడు. ఇది పురుషుల టీ20ల్లో అత్యధిక పవర్‌ప్లే స్కోరు.



ఆ మ్యాచ్‌లో వైభవ్ 19 బంతుల్లో 45, అభిషేక్ 38 బంతుల్లో 113 పరుగులు చేశారు. మొత్తం 10 టీ20ల్లో వైభవ్ 185.53 స్ట్రైక్ రేట్‌తో 295 పరుగులు చేశాడు, ఇందులో 2 అర్ధసెంచరీలు ఉన్నాయి. నవంబర్ 4 నుంచి 6 వరకు జరిగిన ట్రయల్స్, గత ప్రదర్శనల సమీక్ష తర్వాత సెలక్షన్ కమిటీ జట్టును ఖరారు చేసింది. మంగళ్ మహౌర్, పేసర్ షకీబ్ హుస్సేన్‌లను ఫిట్‌నెస్ షరతుతో ఎంపిక చేశారు. తొలి రెండు మ్యాచ్‌ల తర్వాత వారి ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తారు. 16 మంది స్టాండ్‌బై ఆటగాళ్లను కూడా ప్రకటించారు.

మోదీతో సూర్యకుమార్ యాదవ్ భేటీ.. 'రామ్, సరయూ' అంటూ ప్రధాని ట్వీట్

భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యాడు. ఈ భేటీకి సూర్య తన కుటుంబంతో సహా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. సూర్యకుమార్ పిల్లలతో ఆప్యాయంగా గడిపారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సూర్యకుమార్ పిల్లల పేర్లను ప్రస్తావిస్తూ, దీపావళి పండుగ వాతావరణంలో రామ్, సరయూల రాకతో పండుగ వాతావరణం మరింత పవిత్రంగా, దివ్యంగా మారిందని పేర్కొన్నారు. ఈ భేటీలో ఈ ఏడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రక విజయంలో భాగంగా గెలుచుకున్న బంగారు పతకంతో సూర్యకుమార్ కనిపిం చాడు. ప్రధాని మోదీ ఆ పతకాన్ని చేతిలోకి తీసుకుని పరిశీలించి, సూర్యకు మార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ దృశ్యం టీమిండియా చారిత్రక విజ యాన్ని గుర్తుచేసింది. టీ20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. 2022, 2023 సంవత్సరాల్లో వరుసగా 'ఐసీసీ మెన్స్ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును గెలుచుకున్నాడు. 2022 అక్టోబర్‌లో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకున్న సూర్యకుమార్, 2023 జనవరిలో 910 పాయింట్లతో కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్‌ను సాధించాడు. సూర్యకుమార్ నాయకత్వంలోనే భారత్ 2025 టీ20 ఆసియా కప్, 2026 టీ20 ప్రపంచకప్‌లను కైవసం చేసుకుంది. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ రికార్డు

సృష్టించడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, ఇంతటి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే అతనిపై వేటు పడటం గమనార్హం. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న యూకే పర్యటనకు ప్రకటించిన టీ20 జట్టులో సూర్యకుమార్‌కు చోటు దక్కలేదు. ఇటీవల కాలంలో సూర్య బ్యాటింగ్ ఫామ్ కాస్త తగ్గడమే ఇందుకు కారణమని సమాచారం

స్పోర్ట్స్

జీవితం క్రికెట్ కంటే పెద్దది.. భార్య క్యాన్సర్ పోరాటం నా జీవితాన్ని మార్చేసింది: కివీస్ బౌలర్



న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ బ్లెయిర్ టిక్నర్ తన జీవితంలోని అత్యంత కఠినమైన దశ గురించి, క్రికెట్‌పై తన దృక్పథం ఎలా మారిపోయిందనే విషయంపై భావోద్వేగంగా స్పందించాడు. తన భార్య సారా, ఈ ఏడాది ఏప్రిల్‌లో లుకేమియా (ఒక రకమైన బ్లడ్ క్యాన్సర్) బారిన పడిందని, ఎనిమిది నెలల పాటు చికిత్స తీసుకుని కోలుకుందని వెల్లడించాడు. ఈ క్లిష్ట సమయంలో తాను పొందిన అనుభవం జీవితంపై, ఆటపై తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపాడు.భారత్‌తో రెండో వన్డేకు ముందు వెల్లింగ్టన్‌లో మీడియాతో టిక్నర్ మాట్లాడుతూ.. "నా జీవితంలో చాలా ఒడిదొడుకులున్నాయి. ఈ కష్టకాలంలో నా భార్య సారా, నా కుటుంబం అండగా నిలవడం గొప్ప విషయం. ఇప్పుడు నేను మళ్లీ నా క్రికెట్‌ను ఆస్వాదించడం మొదలుపెట్టాను. నా కెరీర్ ప్రారంభంలో చాలా ఒత్తిడికి గురయ్యేవాడిని. ఆ తర్వాత నా భార్య క్యాన్సర్ చికిత్స సమయంలో చాలా కష్టపడ్డాను. ఇప్పుడు ఆ దశను దాటి వచ్చాక, సరదాగా క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నాను. అదే నేను ఇప్పుడు చేస్తున్న పని" అని వివరించాడు.ఈ కష్టకాలం తనకు ఒక ముఖ్యమైన పాఠం నేర్పిందని టిక్నర్ అన్నాడు. "క్రికెట్ నా కెరీర్‌లో ముఖ్యమైన భాగమే, కానీ అదే నా సర్వస్వం కాదు. జీవితం అంతకంటే చాలా పెద్దది. ఆట ముగిశాక నా కూతురు కోసం, నా భార్య కోసం ఇంటికి వెళ్లడం కంటే సంతోషం మరొకటి లేదు. అలా వెళ్లగలుగుతున్నందుకు నేను చాలా అదృష్టవంతుడిని. అందుకే ఇప్పుడు క్రికెట్ ప్రాధాన్యం కాస్త తగ్గింది" అని పేర్కొన్నాడు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. జంటగా అభిషేక్-ఐశ్వర్య

విడాకుల ప్రచారానికి తెర





బాలీవుడ్ స్టార్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్ చాలా రోజుల తర్వాత కలిసి పబ్లిక్‌గా కనిపించారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా నిర్వహించిన దీపావళి వేడుకకు జంటగా హాజరయ్యారు. ఒకరిపై ఒకరు ప్రేమను చూపిస్తూ కెమెరాలకు పోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం అభిమానులను ఆకట్టుకుంటోంది.ఈ వేడుకలో అభిషేక్ నల్లటి కుర్తాలో కనిపించగా.. ఐశ్వర్య ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసింది. ఫొటోలకు పోజులిస్తున్న సమయంలో ఐశ్వర్య ప్రేమగా అభిషేక్ వైపు చూసింది. ఆ తర్వాత ఆయన ఛాతీపై తల వాల్చింది. అభిషేక్ కూడా ఆమె చేతిని పట్టుకుని కనిపించాడు.గత కొంతకాలంగా ఈ జంట వైవాహిక జీవితంపై రకరకాల ఊహాగానాలు వస్తున్న విషయం తెలిసిందే. ఇద్దరూ కలిసి బహిరంగ కార్యక్రమాలకు హాజరుకాకపోవడంతో విడాకులు తీసుకోబోతున్నారంటూ ప్రచారం జరిగింది. అయితే గతంలోనే అభిషేక్ ఈ వార్తలను ఖండించాడు. అవాస్తవమైన ప్రచారంగా కొట్టిపారేశాడు. తాజాగా ఇద్దరూ కలిసి కనిపించడంతో మరోసారి వీరి అనుబంధంపై చర్చ మొదలైంది. ఈ వేడుకకు కుమార్తె ఆరాధ్య మాత్రం హాజరుకాలేదు.ద అభిషేక్, ఐశ్వర్య పరిచయం 1999లో 'ధాయ్ అక్షర్ ప్రేమ్ కే' సినిమా ఫొటోషూట్‌తో మొదలైంది. ఆ తర్వాత 'కుచ్ నా కహో', 'ఉమ్రావ్ జాన్', 'ధూమ్ 2' చిత్రాల్లో కలిసి నటించారు. 'ఉమ్రావ్ జాన్', 'ధూమ్ 2' సినిమాల సమయంలో వారి స్నేహం ప్రేమగా మారింది. 2007లో 'గురు' సినిమా ప్రమోషన్ల కోసం న్యూయార్క్ వెళ్లిన సమయంలో వాళ్లు మరింత దగ్గరయ్యారు. అదే ఏడాది ఏప్రిల్ 20న ముంబయిలో వివాహం చేసుకున్నారు. 2011లో వీరికి ఆరాధ్య జన్మించింది.

'రామాయణ' ఫస్ట్ డే కలెక్షన్స్

భారీ ఓపెనింగ్స్ కానీ అంచనాలు మిస్!

భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల మధ్య విడుదలైన 'రామాయణ' చిత్రం తొలిరోజు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లనే సాధించింది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, నిన్న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. సినిమాకు మంచి స్పందన లభించినప్పటికీ, మొదటి రోజు ఇండియాలో రూ. 65 కోట్ల నెట్ వసూళ్లను మాత్రమే రాబట్టింది. అయితే, ట్రేడ్ పండితులు అంచనా వేసిన రూ. 100 కోట్ల మార్కును మాత్రం అందుకోలేకపోయింది.ట్రేడ్ ట్రాకర్ 'సాక్నిల్క్' ప్రకారం వివిధ భాషల్లో వసూళ్ల వివరాలు చూస్తే.. హిందీలో అత్యధికంగా రూ. 47.50 కోట్లు కలెక్ట్ చేసింది. ఆ తర్వాత కన్నడలో రూ. 7.25 కోట్లు, తెలుగులో రూ. 6 కోట్లు, తమిళంలో రూ. 2.60 కోట్లు, మలయాళంలో రూ. 1.50 కోట్లు వచ్చాయి. ఇండియా గ్రాస్ రూ. 77.50 కోట్లుగా నమోదైంది. ఓవర్సీస్‌లో మరో రూ. 50 కోట్లు గ్రాస్ సాధించడంతో ప్రపంచవ్యాప్తంగా తొలిరోజు మొత్తం గ్రాస్ కలెక్షన్ రూ. 127.50 కోట్లకు చేరింది.గత చిత్రాలతో పోలిస్తే, రణ్‌బీర్ చివరి చిత్రం 'యానిమల్' (రూ. 63.80 కోట్లు) తొలిరోజు వసూళ్లను 'రామాయణ' అధిగమించింది. అలాగే, షారుఖ్ ఖాన్ 'పఠాన్' (రూ. 57 కోట్లు) కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించినప్పటికీ, 'జవాన్' (రూ. 75 కోట్లు) రికార్డును మాత్రం అందుకోలేకపోయింది. దాదాపు రూ. 4,000 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం(రెండు పార్టులుగా)లో యశ్, సన్నీ డియోల్ వంటి తారలు కీలక పాత్రలు పోషించారు.



ప్రభుత్వ ఒత్తిడితో కథ మార్చారా? 'మాతృభూమి'పై సల్మాన్ ఖాన్ క్లారిటీ

తన తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' కథను ప్రభుత్వ ఒత్తిడితో మార్చారన్న ప్రచారాన్ని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఖండించారు. సెన్సార్ బోర్డు అభ్యంతరాల వల్ల సినిమా నిలిచిపోయిందన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ విషయాలపై స్పందించారు.ప్రభుత్వం చెప్పడంతో కథను తిరిగి రాశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సల్మాన్ అన్నారు. "ఇదంతా అబద్ధం. మా సినిమా సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ తిరుగుతుంది. ఇరు దేశాల వైపు ఉన్న సైనికుల జీవితాలను ఇందులో చూపించాం. ఇందులో ఎవరి పట్లా ప్రతికూలత లేదు. పరిస్థితులే ప్రతికూలంగా ఉంటాయి" అని వివరించారు.దర్శకుడు అపూర్వ లఖియా తొలుత మరో కథాంశంతో సినిమా రూపొందించారని సల్మాన్ వెల్లడించారు. ఈ చిత్రం మొదట 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో తెరకెక్కింది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ ఈ కథకు ప్రేరణగా నిలిచింది. అయితే ప్రస్తుత రూపంలో సైనికుల అనుభవాలు, వారి కుటుంబాల భావోద్వేగాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సల్మాన్ తెలిపారు. సైనికులకు దేశమే మొదటి ప్రాధాన్యమని, వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరికి సానుకూల భావాలు ఉన్నా పరిస్థితులు ఎదురైనప్పుడు దేశం కోసమే నిలబడతారని చెప్పారు. ఇరు వైపులా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉండగా, వాయిదా పడింది. తాజా ప్రకటన ప్రకారం డిసెంబరు 4న థియేటర్లలోకి రానుంది. సల్మాన్ ఖాన్ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్, ముఖేశ్ రిషి, అంకుర్ భాటియా, జేన్ షా, అభిలాష్ చౌదరి తదితరులు నటిస్తున్నారు.



'రామాయణ'పై రకుల్ ప్రీత్ సింగ్ భావోద్వేగం

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'రామాయణ' చిత్రం నవంబర్ 6న విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సినిమాలో కీలకమైన శూర్పణఖ పాత్రను నటి రకుల్ ప్రీత్ సింగ్ పోషించారు. తాజాగా ఈ పాత్రలో నటించడంపై తన అనుభవాలను, సంతో షాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "శూర్పణఖ పాత్ర పోషిం చడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన ప్రయాణం. భారతీయ సంస్కృ తిలో భాగ మైన రామాయణాన్ని ఇంత భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది" అని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ఆలోచనను కార్యరూపంలో పెట్టిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచానికి భారత్ నుంచి ఓ అద్భుతమైన చిత్రాన్ని అందించాలన్న వారి తపన తనకు స్ఫూర్తిని చ్చిందని వివరించారు. ఈ సినిమాలో తన సహనటులైన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆమె కృతజ్ఞతలు తెలియ జేశారు. ముఖ్యంగా, రోజూ నాలుగు గంటల పాటు శ్రమించి తనను శూర్ప ణఖగా సిద్ధం చేసిన కాస్ట్యూమ్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావిం చారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా తాను ఎంతో గర్వపడే క్షణం అని రకుల్ తన పోస్టులో ఉద్వేగంగా రాసుకొచ్చారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com